క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



గవర్ల అనకాపల్లిలో కోదండ సీతారామచంద్ర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : గవర్ల అనకాపల్లిలో ఆదివారం కోదండ సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ కాండ్రేగుల సూర్యనారాయణ భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం



దోసలపాడులో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న కంబాల జోగులు

నక్కపల్లి : దోసలపాడులో ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామివారికి ఉదయం నుంచి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు లొడగల చంద్రరావు, పక్కు రమణ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మణిరాజు, పాపారావు, మాజీ సర్పంచ్ గండేపల్లి ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ సూరాకాసుల గోవిందు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేసవి దాహం తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



మునగపాకలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఉపసర్పంచ్ అప్పలనాయుడు

మునగపాక : వేసవి దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని మునగపాక ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు అన్నారు. మునగపాక బైపాస్ రోడ్డులో చెరువుకాలువ సంఘం ఆధ్వర్యంలో సత్తెమ్మతల్లి గుడి వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బలిరెడ్డి సూరిబాబు దంపతులు, సంఘ సభ్యులు బొడ్డేడ రామునాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

1150 లీటర్ల సారా పులుపు ధ్వంసం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

పాయకరావుపేట : ఈదటం గ్రామ శివారు ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించి 500 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేసినట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. పట్టణ సమీపాన గల సుద్దకొండపై ఎస్ఈబీ సిబ్బంది దాడులు నిర్వహించి 650 లీటర్లు బెల్లం పులుపును ధ్వంసం చేశామని, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు.

దుర్గానగర్‌లో కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేట దుర్గానగర్‌లోని గణపతి దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతిహోమం, ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జగదీష్, కృష్ణ, గోపీ, శ్రీను, ముకుంద, కొణతాల శ్రీను, దాడి బుజ్జి పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే ధ్యేయం

- విద్య, వైద్యాన్ని జగనన్న రెండు కళ్లుగా భావిస్తున్నారు
- సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు



నక్కపల్లి కాంప్లెక్స్ వద్ద పోలియో చుక్కలు వేస్తున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి : ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఆదివారం గుల్లిపాడులో పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలను రెండు కళ్లుగా భావిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, తద్వారా సమాజం బాగుపడుతుందన్న ముందు చూపుతో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఈ శ్రద్ధతోనే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి మరింత ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు. పేదవాడి చెంతకే ప్రభుత్వం తరఫున కార్పొరేట్ వైద్యాన్ని తీసుకెళ్లాలనేదే ఫ్యామిలీ డాక్టర్ జగనన్న ఆరోగ్య సురక్ష ఉద్దేశ్యమన్నారు. గతంలో ఇటువంటి కార్యక్రమాలు ఎప్పుడైనా మీరు చూశారా? అని ప్రజలను ప్రశ్నించారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించారన్నారు. ప్రతి సచివాలయానికి ఒక ఏఎన్ఎంను నియమించారనన్నారు. ప్రజలకు వైద్య సేవల కోసం గ్రామాల్లోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకునే పరిమితిని రూ.25 లక్షలు వరకు పెంచడం జరిగిందన్నారు. పోలియో నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుకన్య, సర్పంచ్ కోమర్తి చిట్టిబాబు, స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు పాల్గొన్నారు. మండలంలో పంచాయతీ కార్యాలయాలు, ఆర్టీసీ బస్టాండు, ఏఎన్ఎం సబ్‌సెంటర్ల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, రాజయ్యపేటలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎస్సీ కాలనీలో ఎంపీపీ రత్నం తదితరులు పోలియో చుక్కలు వేశారు.



గుల్లిపాడులో చిన్నారులకు పోలియోచుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

మునగపాక : పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో పిల్లలకు ఆయన చుక్కలు వేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి, సర్పంచ్ అప్పారావు, ఎంపీపీ జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు,ఎంపీటీసీ గణేష్ పాల్గొన్నారు.

35 కేంద్రాల ద్వారా పల్స్ పోలియో

ఎస్.రాయవరం : 0 నుంచి 5 ఏళ్లు నిండిన ప్రతి చిన్నారికి విధిగా పోలియో చుక్కలు వేసి నిండు జీవితానికి రక్షణ కల్పించాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 35 పోలియో కేంద్రాల ద్వారా గ్రామాల్లో పోలియో చుక్కలు వేసినట్టు చెప్పారు. సాయంత్రం 4 గంటల వరకు 92 శాతం పోలియో చుక్కలు వేసినట్టు చెప్పారు. పీహెచ్‌సీ పరిధిలో 3080 పిల్లలు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా అడ్డురోడ్డు బస్‌స్టాప్, నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్‌ల వద్ద ట్రాన్సిట్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రేవుపోలవరం పల్స్‌పోలియో చుక్కలు కేంద్రాన్ని వైద్యాధికారి సందర్శించారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో 24 పోలియో కేంద్రాలు ద్వారా పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. 1239 చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 90 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. ఎస్.రాయవరం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, లింగరాజుపాలెం తదితర గ్రామాల్లో వైద్యాధికారులు శక్తిప్రియ, వాసంతి పర్యటించి పల్స్ పోలియో ప్రక్రియను పరిశీలించారు. అడ్డురోడ్డులో సర్పంచ్ సత్యనారాయణ, గుడివాడలో సర్పంచ్ శ్రీనుబాబు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.



పాయకరావుపేట : పెంటకోటలో పోలియో చుక్కలు వేస్తున్న చిక్కాల రామారావు

పల్స్ పోలియోకు చక్కని స్పందన

కోటవురట్ల : మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్టు డాక్టరు సంతోష్‌కుమార్ తెలిపారు. కె.వెంకటాపురం పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఇందు కోసం 31 బూత్‌లు, ఒక ట్రాన్సిట్ బూత్‌ను ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. డాక్టరు సంతోష్ కుమార్ మాట్లాడుతూ 2009 మంది పిల్లలు లక్ష్యంగా కాగా కొన్ని గ్రామాల్లో తిరునాళ్లు జరగడంతో అంతకుమించి 2,267 మందికి పోలియో చుక్కలు వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఎంపీహెచ్ఈవో గోవిందరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని అచ్యుతాపురం, హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. అచ్యుతాపురం జంక్షన్‌లో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎం.జగన్నాథపురంలో ఎంపీటీసీ రావి నాగలక్ష్మి, ఉప్పవరంలో సచివాలయ కన్వీనర్ చిన్ని శ్రీనివాసరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యురాలు శ్రావణి, పి.ఎస్.టి.పట్నాయక్, పంచదార్ల పైడిరాజు, జెడ్పీటీసీ లాలం రాంబాబు, ఎంపీపీ కోన బుజ్జి, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతాపురం కూడలిలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న సుకుమారవర్మ

రాంబిల్లి : రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీల పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. దిమిలిలో జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ బాలాజీ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్యాధికారులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ అనిల్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పాయకరావుపేట : పాయకరావుపేట, మంగవరం ,శ్రీరాంపురం పీహెచ్‌సీల పరిధిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పాయకరావుపేట పీహెచ్‌సీ పరిధిలో 3809 మంది (93 శాతం)మంగవరం పీహెచ్‌సీ పరిధిలో 2400 మంది పిల్లలకు (96 శాతం), శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో 3678 మంది పిల్లలకు (94శాతం) పోలియో చుక్కలు వేశారు. పెంటకోటలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పిల్లలకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. లింగాల కాలనీలో జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాయకరావుపేట, మంగవరం, శ్రీరాంపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ సుభాష్, డాక్టర్ సౌందర్య, డాక్టర్ సంకీర్తన, డాక్టర్ స్వరాజ్యం, డాక్టర్ పి.కావ్య, వైద్య బృందం ఆయా పోలింగ్ కేంద్రాల్లో చిన్నారులకు చుక్కల మందు వేశారు.

యలమంచిలి రూరల్ : పోలియో రహిత దేశమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. నేషనల్ ఇమ్యునైజేషన్‌డేను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు. తులసీనగర్ భూలోకమాంబ ఆలయం వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని రమాకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఏటికొప్పాకలో జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మిగిలిన పిల్లలకు ఈ నెల 4, 5 తేదీల్లో వారున్న ప్రాంతాలకే వెళ్లి ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేయనున్నారు. కార్యక్రమంలో ఏటికొప్పాక వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, స్కూల్ కమిటీ చైర్మన్ ప్రసాద్, ఏఎన్ఎం కుమారి పాల్గొన్నారు.



ఎస్.రాయవరం : ఇటుకల పరిశ్రమల్లో కార్మికుల చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి



యలమంచిలిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



ఏటికొప్పాకలో పిల్లలకు చుక్కల మందు వేస్తున్న జెడ్పీటీసీ సంధ్యారాణి



ఎస్.రాయవరం : రేవుపోలవరంలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి రాజేశ్వరి



కోటవురట్ల: సుంకపూరులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



పాయకరావుపేట : లింగాలకాలనీలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న సూర్యనారాయణ



మునగపాకలో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ



రాంబిల్లి : దిమిలిలో పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా లెప్రసి అధికారి డాక్టర్ బాలాజీ

వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవంలో గుమ్మడికాయకు బండి చక్రం వేలాడదీసిన దృశ్యం



గౌరీపరమేశ్వరులను దర్శించుకున్న భక్తులు

కోటవురట్ల: లింగాపురంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామం విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోయింది. బాణసంచా కనువిందు చేసింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గౌరీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తిరునాళ్లలో చిన్నారులు సందడి చేశారు. ఆచారం ప్రకారం నిర్వహించిన పలు కార్యక్రమాలు సందర్శకులను అబ్బురపరిచాయి. గుమ్మడికాయకు రెండు కత్తులు గుచ్చి పై కత్తికి తాళ్లుకట్టి పైకి కట్టారు. రెండో కత్తికి బండి చక్రాన్ని వేలాడదీశారు. సొరకాయకు మంచినీటి బిందెను వేలాడదీశారు.

మద్యం నుంచి విముక్తి ‘ఏఏ’ సంస్థ లక్ష్యం



ఏఏ సంస్థ 5వ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోవింద్

యలమంచిలి రూరల్ : మద్యం దురలవాటు కారణంగా శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నవారు ఎందరో. మద్యానికి దాసులైన వారు ఏదో సందర్భంలో ఆ దురలవాటు నుంచి బయటపడాలనుకుంటారు. అటువంటి వారికి చేయూతనిస్తోంది ఆల్కహాలిక్స్ ఎనానిమస్(ఏఏ) సంస్థ. ఏ మందూ లేని మద్యం వ్యసనాన్ని మనోబలంతో అధిగమించవచ్చన్న ఆత్మస్థైర్యాన్నిస్తోంది. దాదాపు 90 ఏళ్ల క్రితం అమెరికాలో పుట్టిన ఈ సంస్థ ఇపుడు తెలుగు రాష్ట్రాల్లో కూడా బాగా ప్రాచుర్యం పొందుతోంది. ఏఏ సంస్థ యలమంచిలి శాఖ 5వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక గురప్ప కల్యాణ మండపంలో జరిగింది. ఉమ్మడి విశాఖ, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి సుమారు 400 మంది మద్యం నుంచి విముక్తి పొందినవారు హాజరయ్యారు. వారిలో కొందరు ఒక్కొక్కరుగా వేదికపైకి వెళ్లి వారు ఎలా తాగుడు వ్యసనం నుంచి బయటపడ్డారో, ప్రస్తుతం ఎంత హాయిగా కుటుంబాలతో జీవిస్తున్నారో వివరించారు.

ఏఏ సంస్థ పనితీరు అద్భుతం...

ఆల్కహాలిక్స్ ఎనానిమస్ (ఏఏ) సంస్థ పనిచేసే విధానం నిజంగా అద్భుతంగా ఉందని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అభిప్రాయపడ్డారు. ఎన్నో కుటుంబాలు మద్యం కారణంగా చిన్నాభిన్నమౌతున్నాయన్నారు. ఈ దురలవాటు కోసం సంపాదనలో సగానికి పైగా ఖర్చు చేస్తున్నారని, దీంతో వారి కుటుంబసభ్యులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. అటువంటి వారికి ఈ దురలవాటు నుంచి విముక్తి కల్పించడానికి స్వచ్ఛందంగా సభ్యులు పనిచేయడం అభినందనీయమన్నారు. సీనియర్ గైడ్‌లు లక్ష్మీపతిరాజు, రాంబాబు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా వందలాది మంది మద్యం నుంచి విముక్తి పొందారన్నారు. ఆల్కహాలిజం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదని, ఇదో కుటుంబ సంక్షోభమన్నారు. తాగుడు వ్యసనం హత్యల నుంచి రోడ్డు ప్రమాదాల వరకూ ఎన్నో చట్టపరమైన తప్పులకు కారణమవుతోందన్నారు. ఈ వ్యసనాన్ని ఎదుర్కొనేందుకు ఏఏ సంస్థ చాలా పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో నాలుగు జిల్లాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవం



కశింకోటలోని గవరపేటలో ఊరేగిస్తున్న గౌరమ్మకు స్థానికుల పూజలు

కశింకోట: స్థానిక వెలంపేట గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) నిమజ్జనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు పార్కు వద్ద గల గౌరమ్మను ఆలయం నుంచి అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై వెలంపేట, గవరపేటల మీదుగా పెదగుమ్మం వరకు గౌరీపరమేశ్వరులను ఊరేగించారు. ఈ సందర్భంగా దారు పొడవునా ప్రజలు దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం శారదానదిలో నిమజ్జనం చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

దిమిలిలో డ్రైనేజీ పనులు ప్రారంభం



మురుగుకాలువ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ చిలుకు, ఉపసర్పంచ్ మురళీకృష్ణ

రాంబిల్లి: దిమిలిలో మురుగుకాలువ నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ ప్రారంభించారు. రూ 5 లక్షలతో మురుగుకాలువలను నిర్మిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో ఈ పనులు పూర్తి చేయనున్నట్లు సర్పంచ్ చిలుకు, ఉప సర్పంచ్ మురళీకృష్ణ తెలిపారు.


కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అనంత్

మునగపాక : కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు తనకాల అనంత్ కోరారు. మునగపాకలో ఆదివారం జరిగిన పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. అలాగే టీడీపీ-జనసేన కూటమికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదిమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాహుల్, పీసీసీ సభ్యుడు కూండ్రపు అప్పారావు,మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి వెంకటరావు,ప్రధాన కార్యదర్శి రామసత్యం, పాల్గొన్నారు

7,8 తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరావు

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో ఈనెల 7, 8 తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి ఆహ్వాన వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు సీతారామ దేవస్థానం చైర్మన్ దాడి భాస్కరరావు తెలిపారు. సీతారామాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోటీలు 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. 9 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని, లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. ఫైనల్స్‌ను 8వ తేదీన నిర్వహించనున్నట్టు చెప్పారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.6వేలు, నాలుగో బహుమతిగా రూ.4వేలు, షీల్డ్‌లు అందజేయనున్నామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతోపాటు రవాణా ఖర్చులు కూడా అందజేస్తామని చెప్పారు.

వలంటీర్ సేవాభావం





అప్పారావుకు వృద్ధాప్య పింఛన్, పైడమ్మకు అభయ హస్తం పింఛన్ అందజేస్తున్న వలంటీర్

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మెరుగైన ఫలితాలు ఇస్తుంది. తమకు కేటాయించిన 50 కుటుంబాలకు సకాలంలో సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజుపేటకు చెందిన భార్యాభర్తలు పాల అప్పారావు, పైడమ్మ దంపతులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గాజువాకలోని తమ కూతురు ఇంటివద్ద ఉంటున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛన్‌ను ఆదివారం సంబంధిత వలంటీర్ జక్కా ప్రభావతి గాజువాక వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. వలంటీర్ ప్రభావతి సేవలను స్థానికులు అభినందించారు.

రూ.33 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు



గంటవానిపాలెంలో జల్‌జీవన్ మిషన్ పనులను ప్రారంభిస్తున్న సుకుమారవర్మ

మునగపాక : జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్య ఉండదని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ అన్నారు. గంటవానిపాలెం గ్రామంలో రూ.33 లక్షలతో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు ఆదివారం భూమిపూజ చేశారు. సంఘం ద్వారా పనులు వేగవంతం చేసి వినియోగంలోకి వచ్చేలా చూడాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రామ్మోహనరావు, పార్టీ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంపిటేటివ్ పరీక్షలకు ఉచితంగా కోచింగ్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: కాంపిటేటివ్ పరీక్షలకు హాజరేయ్యే విద్యార్థులకు శ్రీగౌరీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్టు సంఘ అధ్యక్షుడు ఆడారి నారాయణమూర్తి తెలిపారు. మండలంలోని తుమ్మపాల హైస్కూల్లో ఆదివారం మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ హైస్కూళ్లలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పరీక్ష నిర్వహించినట్టు ఆయన చెప్పారు. ఈ పరీక్షకు తుమ్మపాల, మార్టూరు, మామిడిపాలెం, కొండుపాలెం, సీహెచ్.ఎన్.అగ్రహారం, కొప్పాక, కూండ్రం, తారకరామాకాలనీ, దిబ్బపాలెం, సీతానగరం తదితర గ్రామాల నుంచి 378 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు గోవిందరావు, ఉపాధ్యక్షుడు రాపేటి సూర్యనారాయణ , ప్రధాన కార్యదర్శి కె.జోగ అప్పారావు పాల్గొన్నారు.